
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం : 29 : జూలై : 2025



12,121 క్యూసెక్కుల వరద

సోమశిల: జలాశయంలో సోమవారానికి 30.525 టీఎంసీలు ఉన్నాయి. ఇన్‌ఫ్లో 12,121 ఉండగా, దిగువ కాలువలకు 2,570 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,01,480
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.9,173
3 శాతం జీఎస్టీతో	రూ.9,448
వెండి (8 గ్రా)	రూ.75,584

గరిష్టం/కనిష్టం 36.5 /27.6

వాతావరణం

జిల్లాలో మంగళవారం వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. సోమవారం గాలిలో తేమ 51 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

31న నల్లపరెడ్డి నివాసానికి వైఎస్ జగన్ రాక

- భద్రతా ఏర్పాట్లపై చర్చించిన డీఎస్పీలు



ప్రసన్నకుమార్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, విజయ కుమార్‌రెడ్డితో చర్చిస్తున్న నెల్లూరు నగర, రూరల్ డీఎస్పీలు

నెల్లూరు (క్రైమ్): మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 31న నెల్లూరు నగరంలోని సుజాతమ్మకాలనీలో ఉన్న మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటికి రానున్నారు. ప్రసన్న ఇంటిని టీడీపీ రౌడీమూకలు ధ్వంసం చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో నల్లపరెడ్డితోపాటు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. ఈ నేపథ్యంలో నెల్లూరు నగర, రూరల్ డీఎస్పీలు పి.సింధుప్రియ, ఘట్టమనేని శ్రీనివాసరావు తమ సిబ్బందితో కలిసి సోమవారం ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటికి వచ్చారు. పర్యటన ఏర్పాట్లు, భద్రత తదితర అంశాలపై వారు ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డితో కలిసి చర్చించారు.

న్యాయశాఖ ఉద్యోగాల సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక



జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన న్యాయశాఖ ఉద్యోగ సంఘ నాయకులు

నెల్లూరు (లీగల్): జిల్లా న్యాయశాఖ ఉద్యోగాల సంఘ ఎన్నికలు సోమవారం ఏకగ్రీవంగా జరిగాయి. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయశాఖ ఉద్యోగుల కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా పీవీ నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కె.వెంకటసునీల్, ట్రెజరర్ ఎస్‌కే షఫీ, అసోసియేట్ ప్రెసిడెంట్ వి.వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.దీపక్, గౌరవ అధ్యక్షుడిగా బి.శివయ్య, ఉపాధ్యక్షులుగా ఎస్.శివయ్య, సీహెచ్ బాలయ్య, శివప్రసాద్ బాబు, సీహెచ్ వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీగా బి.సురేంద్రబాబుతో పాటు మరో 11 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం కార్యవర్గ సభ్యులు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

నేడు పీఎంశ్రీ స్కూల్ వర్చువల్‌గా ప్రారంభం

నెల్లూరు(టౌన్): జాతీయ విద్యా విధానంలో భాగంగా జిల్లాలో పీఎంశ్రీకు ఎంపికైన కలిగిరిలోని ఏపీ మోడల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన అధునాతన వసతులను మంగళవారం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ వర్చువల్‌గా ఢిల్లీ నుంచి ప్రారంభించనున్నారు. జిల్లాలో మొత్తం 46 పాఠశాలలు పీఎంశ్రీకి ఎంపికయ్యాయి. ఈ పాఠశాలల్లో కేంద్ర ప్రభుత్వం అధునాతన ల్యాబ్, డిజిటల్ తరగతులు, క్రీడా మైదానం తదితర వసతులు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే కలిగిరి ఏపీ మోడల్ స్కూల్‌లో ఈ వసతులు ఏర్పాటు చేయడంతో ఆ స్కూల్‌ను మంత్రి ప్రారంభించనున్నారు.

ఎంపీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

- ఆగస్టు 12న పోలింగ్, 14న కౌంటింగ్ ప్రక్రియ

విడవలూరు: విడవలూరు బిట్–2 ఎంపీటీసీగా, ఎంపీపీగా ఉన్న భవానమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో ఖాళీ అయిన ఎంపీటీసీ స్థానానికి ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం నోటిఫికేషన్‌ను విడదల చేసింది. ఈ ఎన్నికలకు కోవూరు పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.మోహన్ రావును రిటర్నింగ్ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అదనపు రిటర్నింగ్ అధికారులుగా కొడవలూరు ఎంపీడీఓ నగేష్ కుమారి, తహసీల్దారు చంద్రశేఖర్‌ను నియమించారు.

షెడ్యూల్ ప్రక్రియ

షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 1వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ దాఖలు చేయడానికి గడువు. 2వ తేదీ నామినేషన్ల పరిశీలన ప్రక్రియ. అదే రోజు తిరస్కరించిన నామినేషన్లపై ఆర్డీఓ ఎదుట సాయంత్రం 5 గంటల్లోగా అప్పీల్ చేసుకునే అవకాశం. 4వ తేదీ అప్పిలేట్ అథారిటీ అప్పీల్ పరిష్కారం. 5వ తేదీ నామినేషన్లు 3 గంటల లోపు ఉపసంహరణ, అదే రోజు పోటీలోని అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ. ఆగస్టు 12వ తేదీ ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికల ప్రక్రియ సాగుతుంది. 13వ తేదీ అవసరమైతే రీ పోలింగ్ నిర్వహించాలని, 14వ తేదీ ఓట్ల లెక్కింపు జరిపి ఫలితాలను వెల్లడించాల్సి ఉంది.



మాట్లాడుతున్న మాజీ మంత్రి, రీజనల్ కో ఆర్డినేటర్ కారుమూరి, పార్టీ నేతలు

ప్రజాస్వామ్యంలో చీకటి పాలన

- మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటనపై ఆంక్షలేంటి
- రాచరిక పాలనతో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు
- ప్రజాభిమానాన్ని ఆపడం ఎవరి తరం కాదు
- ప్రశ్నించడాన్ని జీర్ణించుకోలేక అక్రమ కేసులు, అరెస్ట్‌లు
- అబద్ధపు హామీలతో కూటమి ప్రభుత్వంపై వెల్లువెత్తుతున్న ప్రజాగ్రహం
- వైఎస్ జగన్ ఎక్కడికెళ్లినా పోటెత్తుతున్న ప్రజలు
- అది జీర్ణించుకోలేకే ఇలాంటి కుట్రలు, కుతంత్రాలు
- పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ కారుమూరి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్య పాలనకు పాతరేసి చీకటి పాలన సాగిస్తోందని, రాచరిక పాలనతో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తోందని, దేశ చరిత్రలో ఇలాంటి పాలన ఎక్కడా చూడలేదని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు దుయ్యబట్టారు. నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం మాజీ ఎంపీ ఆదాల ప్రభాకరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నెల్లూరురూరల్ ఇన్‌చార్జి ఆనం విజయ్ కుమార్‌రెడ్డి, నెల్లూరు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పార్టీ రీజనల్ మహిళా విభాగం అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, కాకాణి కుమార్తె పూజితతో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. కారుమూరి మాట్లాడుతూ ఈ నెల 31న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటన ఖరారైన నేపథ్యంలో పోలీసులు అర్థం లేని ఆంక్షలు పెట్టడం చూస్తే ప్రజాస్వా మ్య దేశంలో ఉన్నామా? లేక నియంతృత్వ పాలన సాగించే దేశంలో ఉన్నామా? అని ప్రశ్నించారు.

కూటమి అధికారంలోకి వచ్చాక..

రాష్ట్రమంతా వైఎస్సార్‌సీపీ శ్రేణులపై అక్రమ కేసు లు, అరెస్ట్‌లతో అరాచకాలకు పాల్పడుతోంది. అందులో భాగంగానే మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై ఒకటి తర్వాత మరొకటి అక్రమ కేసులు పెట్టి దాదాపు రెండు నెలలుగా జైల్లో ఉంచారన్నారు. ఫ్యాక్షన్ కక్షలతో రగిలిపోయే రాయలసీమలోనే జరగని విధంగా రాజకీయంగా చేసిన విమర్శలపై ప్రతివిమర్శలు చేశారని మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిని టీడీపీ కిరాయి రౌడీమూకలతో ఇంటి గోడలు మినహా అణువణవు ధ్వంసం చేశారని, ఇంట్లో ఉండి ఉంటే ప్రసన్నను సైతం హతమార్చేవారన్నారు. జిల్లాలో ఎప్పుడూ జరగని అక్రమ కేసులకు గురైన కాకాణినితో జైల్లో ములాఖత్ కావడానికి, దౌర్జన్య కాండకు దెబ్బతిన్న నల్లపరెడ్డి ప్రసన్న కుటుంబాన్ని పరామర్శించేందుకు ఈ నెల 31న ఉదయం 10 గంటలకు హెలికాప్టర్‌లో నెల్లూరుకు వస్తున్న తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాకపై అత్యధిక ఆంక్షలు పెట్టడం దారుణమన్నారు.

ప్రజాభిమాన్ని తట్టుకోలేక కుతంత్రాలు

రెడ్‌బుక్ రాజ్యాంగంతో అక్రమ అరెస్ట్‌లు, దౌర్జన్య కాండలు సాగిస్తూ ప్రభుత్వం చేస్తున్న పాలనను ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్‌తో ప్రజలను అభివృద్ధి చేస్తామని అబద్ధాలతో అధికారంలోకి వచ్చి ప్రజా స్వామ్యాన్ని రాచరికపు పాలనగా మార్చారన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు మంచి పాలన అందించాలే కాని రాచరిక పాలనను ప్రజలు ఒప్పుకోరన్నారు. రైతులను, ప్రజలను అక్రమ కేసులు, అరెస్ట్‌లతో నాయకులను ఇబ్బందులు పెడుతున్నప్పుడు ప్రతిపక్ష నాయకులు వస్తుంటే వారి పర్యటనకు ఆంక్షలు పెట్టడం కూడా భావ్యం కాదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడకు వచ్చినా ప్రజలు విపరీతంగా రావడాన్ని తట్టుకోలేకనే కూటమి ప్రభుత్వం విపరీతమైన ఆంక్షలను పెడుతుందన్నారు. నెల్లూరులో వైఎస్ జగన్ పర్యటనకు వైఎస్సార్‌సీపీ నాయకులే కాదు.. కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఉన్న ప్రజలందరూ వస్తారన్నారు. అరచేతితో సూర్య కాంతిని ఎలా ఆపలేరో.. ఈ ప్రజాభిమానాన్ని కూడా అడ్డుకోలేరని స్పష్టం చేశారు.

హెలిప్యాడ్ పనుల పరిశీలన

వెంకటాచలం: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 31న జిల్లా పర్యటనకు రానుండడంతో మండలంలోని చెముడుగుంట వద్దనున్న సెంట్రల్ జైలు సమీపంలో హెలిప్యాడ్ పనులు జరుగుతున్నాయి. ఈ పనులను వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి వెంకట నాగేశ్వర రావు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. వైఎస్ జగన్ హెలికాప్టర్ దిగే హెలిప్యాడ్ వద్దకు భారీగా అభిమానులు తరలివచ్చే అవకాశం ఉండడంతో తీసుకోవాల్సిన చర్యలపై వారు చర్చించారు. ఆ మేరకు హెలిప్యాడ్ పరిసరాలను పరిశీలించి ఏర్పాట్లు చేస్తున్నారు.

మాజీ సీఎం పర్యటనకు ఇన్ని ఆంక్షలా?

జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు పెట్టిన ఆంక్షలు అత్యంత దుర్మార్గంగా ఉన్నాయన్నారు. ఈ నెల 3న పర్యటన ఖరారైన సమయంలోనూ ప్రభుత్వం, పోలీసులు కనీసం హెలిప్యాడ్‌కు స్థలం కేటాయించకుండా అడ్డుపడ్డారన్నారు. చివరి నిమిషంలో అత్యంత ప్రమాదకరమైన ప్రదేశంలో హెలిప్యాడ్ ఏర్పాటుకు అనుమతివ్వడంతో పర్యటన రద్దు చేయాల్సి వచ్చిందన్నారు. అయితే ఈ దఫా ఎవరెన్ని ఆంక్షలు పెట్టిన వైఎస్ జగన్ పర్యటన ఖరారు కావడంతో పోలీసులు కఠిన ఆంక్షలు విధించడం చాలా దారుణమన్నారు. ఈ పర్యటనకు సంబంధించి మొదటి ఇచ్చిన నోటీసులో హెలిప్యాడ్ వద్దకు మూడు వాహనాలే అని, ములాఖత్‌కు ముగ్గురు మాత్రమే అని, అసలు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటి వద్దకు ఒక్కరికీ కూడా అనుమతి లేదంటూ ఇచ్చిన నోటీసును తీసుకునేందుకు తాను నిరాకరించానని తెలిపారు. ఆ తర్వాత రెండో నోటీసులో జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు మూడు వాహనాలకు బదులు 15 వాహనాలను, హెలిప్యాడ్ వద్దకు, జైలు వద్దకు 10 మందికి అనుమతిస్తామని, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటికి మాత్రం ఒక్కరికీ అనుమతి లేదంటూ ఇచ్చారన్నారు. తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు వస్తే రాప్తాడు, పొదిలి, పల్నాడు తదితర ప్రాంతాల్లో విపరీతమైన జనాలు రావడంతో కూటమి ప్రభుత్వానికి దడ పుడుతుందన్నారు. అందుకు నెల్లూరు పర్యటనలో 25 మందికి వలంటీర్‌ను నియమించాలని, కారు నంబర్లు, డ్రైవర్ల ఆధార్ కార్డులు ఇవ్వాలని నోటీసులు ఇవ్వడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. కూటమి ప్రభుత్వ అక్రమాలను తట్టుకోలేక జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో జనాలు స్వచ్ఛందంగా వస్తున్నారని, వారిని ఆపడం ఎవరి తరం కాదన్నారు. కూటమి ప్రభుత్వం మాదిరిగా బస్సులు, ట్రాక్టర్లతో ప్రజలను తరలించమని, స్వచ్ఛందంగానే ప్రజలు వస్తున్నారని, జగన్‌మోహన్‌రెడ్డిపై వారికున్న అభిమానానికి నిదర్శనమన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మెలో ఉద్రిక్తత

- ప్రైవేట్ వ్యక్తులతో పనిచేయిస్తుండగా అడ్డుకున్న రెగ్యులర్ కార్మికులు
- వారిపై పోలీసుల దురుసు ప్రవర్తన
- మర్యాదగా మాట్లాడాలనడంతో ఆగ్రహంతో లాఠీచార్జి
- పలువురు మహిళలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌లో నిర్బంధం
- పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన కార్మికులు



మహిళా కార్మికులను పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించిన వేదాయపాళెం పోలీసులు

నెల్లూరు (క్రైమ్): పారిశుద్ధ్య పనులను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించి తమ కడుపులు కొట్టొద్దంటూ గడిచిన 14 రోజులుగా మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె సోమవారం ఉద్రిక్తంగా మారింది. నిప్పో, అయ్యప్పగుడి ప్రాంతాల్లో ప్రైవేట్ వ్యక్తులతో అధికారులు పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నారన్న సమాచారం అందుకున్న మున్సిపల్ కార్మికులు అక్కడికి చేరుకుని తమ పనులను ఇతరులతో చేయిస్తే సహించమన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని వారు అధికారులను కోరారు. తామెదుర్కొంటున్న ఇబ్బందులను తెలియజేస్తూ సహకరించాలని ప్రైవేట్ వ్యక్తులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం కార్మికులు నిరసన ర్యాలీ చేపట్టారు. ఇంతలోనే అక్కడికి చేరుకున్న వేదాయపాళెం పోలీసులు కార్మికులతో దురుసుగా ప్రవర్తించారు. మహిళలను మగ పోలీసులు ఈడ్చుకెళ్లడాన్ని తీవ్రంగా ప్రతిఘటించారు. ఆడ పోలీసులు లేకుండా ఎలా ఈడ్చుకెళ్తారంటూ నిలదీశారు. దీంతో ఆగ్రహావేశాలతో పోలీసులు జీపుల్లో ఎత్తిపడేసి వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. వీరితోపాటు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రూరల్ అధ్యక్షుడు దేశమూర్తితోపాటు పలువురిని పోలీసుస్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న కార్మికులు పెద్ద సంఖ్యలో స్టేషన్ వద్దకు చేరుకున్నారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతోపాటు పరిస్థితి జఠిలం కావడంతో ఆందోళ కారులపై లాఠీచార్జి చేయడంతో పలువురికి స్వల్పగాయాలయ్యాయి. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో కొందరు మహిళ కార్మికులను స్టేషన్‌లోకి తీసుకెళ్లి నిర్బంధించారు. మరి కొన్ని ప్రాంతాల్లో నిరసన ర్యాలీలు నిర్వహిస్తున్న కార్మికులు స్టేషన్ వద్దకు చేరుకుని బైఠాయించారు. ఈ విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు, మరికొందరు నేతలు, కార్మికులతో కలిసి స్టేషన్ వద్దకు చేరుకున్నారు. వారు వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసరావుతో చర్చించారు. స్టేషన్‌లో ఉన్న కార్మికులందరిని సొంత పూచీకత్తుపై బయటకు తీసుకువచ్చారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న కార్మికులపై ఇన్‌స్పెక్టర్ దురుసుగా వ్యవహరిస్తూ లాఠీచార్జి చేయడం దారుణమన్నారు. మున్సిపల్ కార్మికులందరూ దళితులు, గిరిజనులని వారిపై ఇలా ప్రవర్తించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలే తప్ప ఇలాంటి నిర్బంధాలు పెట్టడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు.



కార్మికులపై లాఠీచార్జి చేస్తున్న పోలీసులు



తమ వారిని విడిచి పెట్టాలని దండం పెడుతూ..



పోలీస్‌స్టేషను ముట్టడించిన కార్మికులు

కోర్టు ఆదేశాలున్నా సరే..

కూల్చేస్తాం

జిల్లాలో అధికార పార్టీ నేతల కుట్రలు, కుతంత్రాలకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. అధికార యంత్రాంగం సైతం ఎమ్మెల్యేలు చెప్పారంటూ వెనుకా ముందు చూడకుండా ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు, ఆస్తుల ధ్వంసానికి బరితెగిస్తున్నారు. రాజ్యాంగ వ్యవస్థలోని అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను సైతం ధిక్కరిస్తూ టీడీపీ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు. డైవర్షన్ రాజకీయాల్లో భాగంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటన రోజే ఆ పార్టీ కోవూరు నియోజకవర్గ దళిత నేత, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, వీరి చలపతికి చెందిన ఆస్తుల ధ్వంసానికి డెడ్‌లైన్ విధించారు. మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కీలక అనుచరుడు కావడంతో ఆయన్ను టార్గెట్ చేశారు. ఆస్తులు ధ్వంసం చేయడమేకాకుండా పలు అక్రమ కేసుల్లో ఇరికించేందుకు కుట్రలు పన్నుతున్నారు.



గతంలో నిర్మించిన దుకాణం వెనుక ఖాళీ స్థలంలో అనుమతులతో నిర్మిస్తున్న దుకాణ సముదాయం

- రాజుపాళెంలో దళిత నేత వీరి చలపతి షాపులు కూల్చేందుకు కుట్రలు
- వాటి జోలికి వెళ్లొద్దని న్యాయస్థానం ఆదేశాలిచ్చినా పట్టించుకోని అధికారులు
- వైఎస్ జగన్ పర్యటన రోజే కూల్చివేతకు తుది గడువుగా నోటీసులు
- ఇప్పటికే ఆయనపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపేందుకు కుతంత్రం
- అధికార పార్టీ నేతల తీరుపై మండి పడుతున్న ప్రజలు



నార్తురాజుపాళెం మెయిన్ రోడ్డు పక్కనున్న వీరి కళైవాణి స్థలంలో గతంలో నిర్మించిన దుకాణం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: వైఎస్సార్‌సీపీలో దళితుడైన కీలక నేత, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావును టీడీపీ టార్గెట్ చేసింది. మాజీమంత్రి, కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి కీలక అనుచరుడు కావడంతో ఆయన ఆర్థిక మూలాలను దెబ్బతీసే కుట్రలకు తెర తీశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా ఉన్న వీరి చలపతిరావు స్వగ్రామం నార్తురాజుపాళెంలో మెయిన్ రోడ్డుకు పక్కనే ఉన్న 50–2 సర్వే నంబరులో ఉన్న 25 అంకణాల స్థలాన్ని 2006లో యానాదమ్మ భర్త సాల్మన్ నుంచి రూ.2.50 లక్షలకు కొనుగోలు చేశారు. 2010లో పంచాయతీ అప్రూవల్‌తో ఆ స్థలంలో దుకాణాన్ని నిర్మించారు. అప్పటి నుంచి కూడా పంచాయతీకి కట్టాల్సిన పన్నులు చెల్లిస్తూ వస్తున్నారు. అయితే టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో 2016లో అప్పటి తహసీల్దార్ ఇది ఆక్రమణ స్థలంగా పేర్కొంటూ తొలగించాలంటూ నోటీసు జారీ చేశారు. దీనిపై చలపతిరావు అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించగా స్టేటస్‌కో ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తర్వాత 2018లో తన పేరిట ఉన్న స్థిరాస్తిని చలపతిరావు భార్య వీరి కళైవాణి పేరిట మార్పు చేశారు. అప్పటి నుంచి ఆమె కూడా ఆ ఆస్తికి సంబంధించిన పన్నులు చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో 2019–24 మధ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందులో వైన్స్ షాపు నిర్వహించింది. అందుకు సంబంధించిన అద్దెను కూడా కళైవాణి ఖాతాలోనే ప్రభుత్వం జమ చేస్తూ వచ్చింది.

ఆ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని..

ఈ ఏడాది జనవరిలో అందులో ఖాళీగా ఉన్న స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించుకునేందుకు పంచాయతీకి 14 శాతం ఫీజు చెల్లించి అనుమతులు పొందారు. అయితే వీరి చలపతిరావును టార్గెట్ చేసిన స్థానిక టీడీపీ నేతలు స్థానిక ఎమ్మెల్యే మెప్పు కోసం కుట్రలకు తెరతీశారు. అందులో భాగంగా ఈ ఏడాది మే 21న నార్తురాజుపాళెం చెందిన టీడీపీ నేత కరకటి మల్లికార్జున ఆ స్థలం ఆక్రమణ అంటూ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అదే నెల 27న తహసీల్దార్ ఈ స్థలాన్ని పరిశీలించాలని స్థానిక ఇరిగేషన్ ఏఈని లేఖ ద్వారా కోరారు. ఈ నేపథ్యంలో ఈ నెల 3న ఇరిగేషన్ ఏఈ ఆ స్థలం ఆక్రమణ అంటూ తొలగించాలని తహసీల్దార్‌కు నివేదిక అందజేశారు. ఇరిగేషన్ ఏఈ, సర్వేయర్లు ఈ నెల 10న ఆ స్థలానికి చేరుకుని దుకాణాలు నిర్మాణం జరుగుతుండడాన్ని కొలతలు తీశారు. దీంతో స్థల యజమాని వీరి కళైవాణి ఈ నెల 14న హైకోర్టును ఆశ్రయించారు. పత్రాలు పరిశీలించిన హైకోర్టు నిర్మాణానికి ఎలాంటి అవాంతరాలు కల్పించొద్దని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయితే అధికారులు కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా ఆ ఉత్తర్వులు తనకు ఇంకా చేరలేదని తహసీల్దార్ చెప్పడంతో తన న్యాయవాది ద్వారా తెలియజేసినప్పటికీ ఇవేమీ పట్టని అధికారులు ఆ స్థలం ఆక్రమణలో ఉన్నందున ఈ నెల 31లోగా స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేని పక్షంలో తగిన చర్యలు తీసుకుంటామని ఈ నెల 18న షోకాజ్ నోటీసును కళైవాణి భర్త వీరి చలపతిరావుకు అందజేశారు.

వివాదంతో ఊపందుకొన్న చర్యలు

కోవూరు నియోజకవర్గంలో ఈ నెల 7వ తేదీ నుంచి విభిన్న రాజకీయ పరిస్థితులు నెలకొన్నాయి. తనను విమర్శించారన్న నెపంతో మాజీమంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి కీలక అనుచరుడిగా ఉన్న చలపతిపై కన్నెర్ర చేశారు. ఈ స్థలంపై టీడీపీ నేత మల్లికార్జున మే నెలలో ఫిర్యాదు చేసినా అధికారులు పెద్దగా పట్టించుకోలేదు. ఈ నెల 7 తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆ ఫిర్యాదుపై తాజా చర్యలు ముమ్మరం చేశారు. ఈ నెల 16న షోకాజ్ నోటీసులు జారీ చేయడం, 18న చలపతిరావుకు అందజేయడం జరిగింది. ఈ నెల 31లోగా నిర్మాణాలు తొలగించాలని నోటీసులో పేర్కొన్నారు. కోర్టు ఆదేశాలు ఉన్నా.. పట్టించుకోకుండా చర్యలకు ఉపక్రమించడం వెనుక స్థానిక ఎమ్మెల్యే ఒత్తిడి ఉందన్న ప్రచారం ఊపందుకొంది.

నిబంధనల మేరకే చర్యలు

నార్తురాజుపాళెంలోని కళైవాణికి చెందిన స్థలం విషయంలో నిబంధనల ప్రకారమే ముందుకు పోతున్నాం. కోర్టు ఉత్తర్వుల్లో స్టేటస్‌కో మంజూరు చేసినట్లు లేదు. నిబంధనల మేరకు నడుచుకోవాలని కోర్టు సూచించడం జరిగింది. ఆ విధంగానే నడుచుకొంటున్నాం. ఈ నెల 31వ తేదీ లోగా స్వచ్ఛందంగా ఆ స్థలంలోని నిర్మాణాలు తొలగించాలని నోటీసు ఇవ్వడం జరిగింది. అప్పటికీ తొలగించకపోతే తదుపరి చర్యలు తీసుకొంటాం.

– కె.స్ఫూర్తిరెడ్డి, తహసీల్దార్, కొడవలూరు

పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం


నెల్లూరు (లీగల్): జిల్లా న్యాయసేవ అధికార సంస్థ న్యాయసేవ సదన్ భవన్‌లోని శాశ్వత లోక్ అదాలత్‌లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీగా ఉన్న హెడ్ క్లర్క్ పోస్టును అవుట్ సోర్సింగ్ విధానంతో భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు, 65 ఏళ్ల లోబడిన వారు అర్హులని, గౌరవ వేతనం రూ.44,570 ఉంటుందని, ఉత్సాహవంతులు దరఖాస్తులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి, చైర్మన్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం, జిల్లా కోర్టు కాంపౌండ్ నెల్లూరుకు ఆగస్టు 6వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు పంపాలని కోరారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 134	చికెన్	: 240
లేయర్ (లైవ్)	: 112	బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 264
బ్రాయిలర్		లేయర్ చికెన్	: 190

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.24
సన్నవి : రూ.15
పండ్లు : రూ.5



మా బాధలు వినండయ్యా..

- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 450 వినతులు
- వీఆర్‌ఏల ధర్నా

నెల్లూరు రూరల్: నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కలెక్టర్ ఆనంద్, జేసీ కె.కార్తీక్, డీఆర్వో హుస్సేన్ సాహెబ్, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి వినతిపత్రాలను స్వీకరించారు. మొత్తం 450 అర్జీలు వచ్చాయి. అందులో రెవెన్యూ శాఖవి 160, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్‌వి 52, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌వి 32, పంచాయతీరాజ్‌వి 36, స్కూల్ ఎడ్యుకేషన్‌వి 25, పోలీస్ శాఖవి 43 తదితర శాఖలవి వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ వినతులు పరిష్కరించే విషయంలో కొన్ని శాఖలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అవినీతి బయటపెట్టానని వేధింపులు

వెలుగు సీసీ, ఏపీఎంల అవినీతి బయట పెట్టినందుకు ఉద్యోగం చేయకుండా అడ్డుకుంటున్నారని రాపూరు మండలం గోనుపల్లికి చెందిన వీఓఏ నాగమణి వినతిపత్రం ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ మండలంలో గిరిజన ఉన్నతి నిధులు సుమారు రూ.కోటి వరకు దోచుకున్న సంగతి బయట పెట్టానన్నారు. ప్రస్తుత ఏపీఎం చంద్రశేఖర్ ద్వారా తనను విధులకు రానివ్వకుండా అడ్డుకుంటున్నారన్నారు. వెంకటగిరి ఎమ్మెల్యే లెటర్ తెస్తేనే ఆఫీసులోకి అడుగుపెట్టాలని అంటున్నారని తెలిపారు. ఇతర శాఖలోని అధికారుల చేత విచారణ చేయించాలని కోరారు.

తప్పుడు కేసు పెట్టించారు

కారు ట్రావెల్స్ బిజినెస్‌లో మా అన్నయ్యను మోసం చేసి తప్పుడు కేసు పెట్టి వేధిస్తున్నారని ఆత్మకూరు మండలం బోయలచిరువెళ్ల గ్రామానికి చెందిన మౌనిష్ శర్మ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన అన్నను మోసగించిన కోటగుంట శ్రీకాంత్, షబ్బీర్ అనే వ్యక్తులు షేక్ కాలేషా అనేవారు టీడీపీ మైనార్టీ లీడర్‌తో కలిసి అక్రమ కేసులు బనాయించారన్నారు. తన అన్నయ్య ఆత్మహత్యాయత్నం చేశాడని, ప్రస్తుతం అతని మానసిక పరిస్థితి బాగోలేదన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. లేకుంటే ఆత్మహత్య శరణ్యమన్నారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్

పొలం ఆక్రమించేందుకు యత్నం

కలువాయి మండలం తోపుగుంట రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 461లోని 1.60 ఎకరాల భూమిని టీడీపీ నేతలు ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని వెంకటేశ్వర్లు అనే వ్యక్తి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో టీడీపీ కోసం పని చేయలేదని కక్షగట్టి ఇండ్ల చెంచయ్య ద్వారా తన భూమిని ఆక్రమించుకోవాలని టీడీపీ నాయకులు చూస్తున్నారని వాపోయారు. పొలాన్ని దున్ని నిమ్మ మొక్కలను నాటారని, అధికారులకు తెలిపినా చర్యలు తీసుకోలేదన్నారు.

సంక్షేమ నిధిని పునఃప్రారంభించాలంటూ..

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధిని ప్రారంభించాలని ఏపీ బిల్డర్స్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి షేక్ ముక్తియార్, గౌరవాధ్యక్షుడు కె.ఆంజనేయులు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ప్రసూతి, అనారోగ్యం, అంగవైకల్యం, మరణాలకు సంబంధించిన 40 వేలకు పైగా క్లెయిమ్స్ చెల్లింపు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జిల్లాలో రూ.5 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉందన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం సివిల్ సప్లయ్స్ ద్వారా కొనుగోలు చేయించాలని టీడీపీ రైతు విభాగం ప్రధాన వెంకటేశ్వర్లు కోరారు. అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ ఉన్నతాధికారులు, రైతు సంఘం, రైస్‌మిల్ అసోసియేషన్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్

ఖాళీగా ఉన్న వీఆర్వో, అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, డ్రైవర్ పోస్టులను వీఆర్‌ఏలతో భర్తీ చేయాలంటూ కలెక్టర్ ఎదుట ధర్నా జరిగింది. ఇందులో వీఆర్‌ఏలు, గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నాయకులు పాల్గొని మాట్లాడారు. వీఆర్‌ఏలపై పనిభారం ఎక్కువైందన్నారు. దీనిని తగ్గించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మోపిన నైట్ వాచ్‌మెన్, ఇసుక డ్యూటీలు రద్దు చేయాలన్నారు. తెలంగాణలో అమలవుతున్న విధంగా పే స్కేల్ ఇవ్వాలన్నారు. అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలన్నారు. అనంతరం కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. నేతలు వి.లచ్చయ్య, జి.ఓబులేశు తదితరులు పాల్గొన్నారు.


ధర్నా నిర్వహిస్తున్న వీఆర్‌ఏలు



కళాశాల బస్సు ఢీకొని..

- వృద్ధురాలి మృతి

ఆత్మకూరు: గేదెలను మేపి తిరిగి ఇంటికి తోలుకెళ్తున్న ఓ వృద్ధురాలిని ఇంజినీరింగ్ కళాశాల బస్సు వేగంగా వెళ్తూ ఢీకొనడంతో మృతిచెందింది. ఈ ఘటన సోమవారం సాయంత్రం ఆత్మకూరు మండలంలోని వాశిలి సమీపంలో నెల్లూరు – ముంబై రహదారిపై చోటు చేసుకుంది. ఎస్సై ఎస్‌కే జిలానీ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వాశిలి గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ (72), శేషారెడ్డి దంపతులకు గేదెలున్నాయి. రోజూలాగే సోమవారం ఆమె గేదెలను కొండమీదకొండూరు గ్రామ సమీపంలోని పొలాలకు తోలుకెళ్లింది. మేపిన తర్వాత తిరిగి వాశిలి గ్రామానికి వస్తూ జాతీయ రహదారిని దాటుతోంది. అదే సమయంలో కొడవలూరు మండలం రాజుపాళేనికి చెందిన ఓ ఇంజినీరింగ్ కళాశాల బస్సు రోడ్డు దాటుతున్న ఆ వృద్ధురాలిని వేగంగా ఢీకొంది. సమీపంలోని వారు పరిశీలించి ఆత్మకూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించేలోపు ప్రాణాలు కోల్పోయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలుడి మృతదేహానికి పోస్టుమార్టం

సోమశిల: అనంతసాగరం మండలంలోని పడమటికంభంపాడు గ్రామంలో ట్రాక్టర్ తొక్కించడంతో మాణికల నాగరాజు (7) అనే బాలుడు మృతిచెందిన విషయం తెలిసిందే. సోమవారం తహసీల్దార్ జయరాజవర్ధన్, సోమశిల ఎస్సై అనూష వివరాలు తెలుసుకున్నారు. కేసు దర్యాప్తులో భాగంగా గ్రామంలో విచారించిన అనంతరం మృతదేహాన్ని గుర్తించేందుకు బాలుడి కుటుంబ సభ్యులతో పెన్నానది వద్దకు వెళ్లారు. పాతిపెట్టిన మృతదేహాన్ని వెలికి తీయించారు. అనంతరం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు చెందిన వైద్యులు ఖదీర్ పోస్టుమార్టం నిర్వహించారు.


మృతదేహాన్ని వెలికితీస్తున్న దృశ్యం

కన్నవారిపై కనికరం లేకుండా..

- తల్లిదండ్రులను ఇబ్బంది పెడుతున్న సంతానం
- పోలీసులకు వృద్ధుల ఫిర్యాదులు

నెల్లూరు(క్రైమ్): 'కడుపున పుట్టిన వారు కనికరం లేకుండా వ్యవహరిస్తున్నారు. మా బాగోగులు పట్టించుకోకుండా హింసిస్తున్నారు' ఇదీ పలువురి తల్లిదండ్రుల ఆవేదన. ప్రతి సోమవారం నెల్లూరులో పోలీస్ ఉన్నతాధికారులు నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ ప్రాంతాల నుంచి వృద్ధులు వచ్చి సంతానం పెడుతున్న ఇబ్బందులపై కన్నీటిపర్యంతమై వినతులు అందిస్తున్నారు. ఈ సోమవారం కూడా పలువురు వచ్చారు. తన కుమారుడు మద్యం మత్తులో చిత్రహింసలు పెడుతున్నాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని నెల్లూరు బాలాజీ నగర్‌కు చెందిన 75 ఏళ్ల వృద్ధుడు కోరాడు. నా భర్తకు పక్షవాతం. నా కాలుకు ఆపరేషన్ జరిగింది. ఇద్దరు కుమారులు మా బాగోగులు పట్టించుకోవడం లేదు. పూటగడవని దయనీయ స్థితిలో ఉన్నాం. విచారించి న్యాయం చేయాలని కొడవలూరుకు చెందిన ఓ వృద్ధురాలు కోరారు.

105 వినతులు

నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి 105 మంది విచ్చేసి ఏఎస్పీ సీహెచ్ సౌజన్య దృష్టికి ఫిర్యాదులను తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు. ఆమె ఆయా ప్రాంత పోలీస్ అధికారులతో మాట్లాడారు. చట్టపరిధిలో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ చెంచు రామారావు, లీగల్ అడ్వైజర్ టి.శ్రీనివాసులురెడ్డి, డీటీసీ, పీసీఆర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు ఎం.నాగేశ్వరమ్మ, బి.శ్రీనివాసరెడ్డి, పి.భక్తవత్సలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మహిళ సమస్య వింటున్న ఏఎస్పీ సౌజన్య

ఫిర్యాదుల్లో కొన్ని..

- భర్త, అత్తింటివారు అదనపుకట్నం కోసం, ఆడపిల్ల పుట్టిందని అవమానిస్తూ ఇంటి నుంచి గెంటేశారని నెల్లూరు నగరానికి చెందిన ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేశారు.
- కుటుంబ సమస్యల నేపథ్యంలో భర్త, అత్తమామలు ఇంటి నుంచి గెంటేశారు. కౌన్సెలింగ్ నిర్వహించి కాపురాన్ని చక్కదిద్దాలని అనంతసాగరానికి చెందిన ఓ మహిళ కోరారు.
- బిట్రగుంటకు చెందిన చైతన్య కుమార్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.2.80 లక్షల నగదు తీసుకుని మోసగించాడని జలదంకి మండలానికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు.
- ఉదయగిరి ప్రాంతానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఇప్పుడు తన ఇంట్లో వాళ్లు ఒప్పుకోవడం లేదని పెళ్లికి నిరాకరించాడని ఉదయగిరి ప్రాంతానికి చెందిన ఓ యువతి వినతిపత్రమిచ్చారు.
- గుంటూరు జిల్లా గురజాలకు చెందిన జానీబాషా బ్యాంక్ లోన్ ఇప్పిస్తానని ఇంటి కాగితాలు, రూ.3 లక్షలు తీసుకున్నాడు. లోన్ ఇప్పించకుండా, నగదు తిరిగివ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని నవాబుపేటకు చెందిన మహిళ అర్జీ ఇచ్చారు.
- గతేడాది మార్చి 24వ తేదీ నుంచి నా కుమారుడు కనిపించడం లేదు. పోలీసులు కేసు నమోదు చేసి సరిపెట్టుకున్నారు. విచారించి ఆచూకీ తెలియజేయాలని బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన ఓ మహిళ కోరారు.

హత్య చేసి.. ఆత్మహత్యగా ప్రచారం

- భర్త మృతిపై భార్య అనుమానాలు

నెల్లూరు(క్రైమ్): తన భర్త తరుణ్‌తేజ మృతిపై పలు అనుమానాలున్నాయని భార్య ప్రవళ్లిక వాపోయారు. తరుణ్ మృతదేహానికి జీజీహెచ్ వైద్యులు సోమవారం శవపరీక్ష నిర్వహించి బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు. మార్చురీ వద్ద ప్రవళ్లిక మీడియాతో మాట్లాడుతూ తరుణ్ ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదన్నారు. అతడిని స్నేహితురాలే హత్య చేసి కప్పిపుచ్చేందుకు ఆత్మహత్య చేసుకున్నాడని ప్రచారం చేస్తున్నట్లు ఆరోపించారు. పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

ఆర్‌ఐఈ భవనాలకు భూమి పూజ నేడు

నెల్లూరు(టౌన్): రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ (ఆర్‌ఐఈ) సంస్థ భవనాలకు మంగళవారం భూమిపూజ నిర్వహించనున్నారు. గతంలో వెంకటాచలం మండలం చౌటపాళెం గ్రామంలో ఆర్‌ఐఈ సంస్థను నిర్మాణం చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. చౌటపాళెంలో 50 ఎకరాల్లో రూ.900 కోట్లతో భవన సముదాయాలకు శంకుస్థాపన చేయనున్నారు. నిర్మాణాలు రానున్న మూడు సంవత్సరాల్లో పూర్తి చేయాలని కేంద్రం ఆదేశించింది. తొలుత ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా భూమిపూజ చేయాలని నిర్ణయించినప్పటికీ అనివార్య కారణాలతో ఆ కార్యక్రమం రద్దయింది. దీంతో ఆ సంస్థకు చెందిన ఓఎస్‌డీ, ప్రొఫెసర్లు తదితరులు పూజలో పాల్గొననున్నారు. ప్రస్తుతం ఆర్‌ఐఈ సంస్థకు సంబంధించి తరగతులను వీఆర్ కళాశాలలో నిర్వహిస్తున్నారు.

కండలేరులో 27.010 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 27.010 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 1,975, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 70, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

సోదరికి మాత్రలు తీసుకెళ్తుండగా..

- ట్రావెల్స్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

కావలి(జలదంకి): విజయవాడ నుంచి బెంగళూరుకు వెళ్తున్న ఎస్వీకేబీటీ ట్రావెల్స్ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన కావలి మండలం చెంచుగానిపాళెం క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగింది. కావలి రూరల్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కావలి మండలం ముసునూరు అరుంధతీయ కాలనీలో పోతిపోక రవి (38) ఉంటున్నాడు. బీటెక్ వరకు చదివాడు. ఓవైపు పోటీ పరీక్షలు రాస్తున్నాడు. మరోవైపు కుటుంబ జీవనం కోసం సెంట్రింగ్ పనికి వెళ్తున్నాడు. అతని సోదరి బుజ్జమ్మ గౌరవరంలో నివాసం ఉంటోంది. బుజ్జమ్మకు ఆరోగ్యం బాగోలేదు. మాత్రలు, కొబ్బరినీరు తెమ్మని రవికి ఫోన్ చేసి చెప్పింది. అతను అవి తీసుకుని మోటార్‌బైక్‌పై గౌరవరానికి బయలుదేరాడు. ఈ క్రమంలో బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రవి భార్య స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కావలి రూరల్ ఎస్సై తిరుమలరెడ్డి కేసు నమోదు చేశారు.


రవి మృతదేహం

దాడి ఘటనపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఓ హిజ్రాపై పలువురు హిజ్రాలు దాడి చేసిన ఘటనపై నెల్లూరు నవాబుపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. కోవూరు వడ్డిపాళేనికి చెందిన హిజ్రా శిరీష భిక్షాటన చేసుకుని జీవనం సాగిస్తోంది. నెల్లూరు బోడిగాడితోటలోని షీలమ్మ వద్ద శిరీష, శిల్పతోపాటు అనేక మంది హిజ్రాలు ఉండేవారు. అయితే ఏడాది క్రితం శిల్ప అక్కడి నుంచి వెళ్లిపోయి వేరుగా ఉంటోంది. శిరీషను కూడా తన వద్దకు వచ్చేయాలని శిల్ప ఒత్తిడి తెస్తోంది. ఆదివారం రాత్రి మాట్లాడాలని శిల్ప పిలవడంతో శిరీష జనార్దనరెడ్డి కాలనీకి వెళ్లింది. శిరీష మాట్లాడుతుండగా శిల్ప, అలేఖ్య, రీతిక, శ్రీనులు ఆమెపై దాడి చేశారు. ఈ మేరకు శిరీష సోమవారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా దాడికి పాల్పడిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మతిస్థిమితం లేని మహిళపై హిజ్రాల దాడి

అనుమసముద్రంపేట: మండల కేంద్రంలో మతిస్థిమితం లేని మహిళపై హిజ్రాలు దాడి చేశారు. స్థానికుల కథనం మేరకు.. ఏఎస్‌పేటలో దర్గాకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తారు. హిజ్రాలు వారానికోసారి భిక్షాటనకు వస్తుంటారు. అయితే కొందరు మద్యం తాగి భక్తుల వద్ద బలవంతంగా వసూళ్లకు పాల్పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. మత్తులో వారు గొడవ పడటమే కాకుండా మతిస్థిమితం లేని వ్యక్తులపై సైతం దాడులకు పాల్పడుతున్నారు. ఆదివారం రాత్రి ఏఎస్‌పేట వైఎస్సార్ విగ్రహం వద్ద నిద్రపోతున్న మతిస్థిమితం లేని మహిళను చితకబాదారు. దీనిపై పోలీసులకు సమాచారం లేదు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

- ఆరుగురు జూదరుల అరెస్ట్
- రూ.1.20 లక్షల స్వాధీనం

కొడవలూరు: పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేసి ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన మండలంలోని రామాపురం వద్దనున్న ఎన్టీఆర్ కాలనీలో సోమవారం చోటుచేసుకుంది. ఇక్కడికి సమీపంలోని పొలాల్లో పేకాట జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్సై సీహెచ్ కోటిరెడ్డి సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకోవడంతోపాటు రూ.1.20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. వారిని కోర్టుకు హాజరుపరిచినట్లు ఆయన పేర్కొన్నారు.